# నాప

మూడంతస్తుల మేడ, మేడ చుట్టూ ఎత్తైన ప్రహరీ గోడ ప్రహరీ గోడకి పెద్ద గేటు. గేటు లోపల రక రకాల పూవుల చెట్లు. ఆచెట్లని యేపుగా పెంచటానికి శక్తినంతా ధారపోసే అరవైయేళ్ళ ముదుసలి ఆయిన తోటమాలి. ఆ మాలికి చెట్లని పెంచటానికే ఆధికారం తప్ప ఒక్క పువ్వు కోసుకునే హక్కులేదు. వృద్ధుడైనా కడుపుకోసం రెక్కలు ముక్కలు చేసుకోక తప్పటం లేదు.

మేడ యాజమాని రంగారావు. పుట్టుకతోనే శ్రీమంతుడు కాడు. చిన్న ఉద్యోగిగా ప్రైవేటు కంపెనీలో చేరి పదేళ్ళు తిరక్కుండానే పెద్ద జీతగాడై పోయాడు. పెద్ద జీతగాడు కాగానే అందుకు సరిపడా హంగులన్నీ వచ్చేశాయి, మేడా కారూ నౌకర్లూ వగైరా.

"ఇదంతా రంగారావు సామర్థ్యం!" అన్నారు మిత్రులు. కానీ రంగారావు భార్య నాంచారమ్మకి తృప్తిలేదు. తన కంటే పై అంతస్థు వాళ్ళవైపే చూస్తూ నిట్టూరుస్తూ వుంటుంది.

రంగారావుకీ వుంది యిలాంటి తహతహ. కానీ అందుకు అవకాశాలు రావద్దూ! వచ్చినప్పుడు వాటిని తెలివి తక్కువగా వదులుకుంటాడా! ఈ సంగతి భార్యకి తెలియదు. అసలు ఈ అంతస్థును పెంచుకునే పరుగుపందెంలో తన తోటివాళ్ళని నిర్దాక్షిణ్యంగా యెలా నెట్టేసి పైకి వచ్చాడో నాంచారికి తెలియదు. ఇలా వెనక్కి పడ్డ వెంకట్రావనే అతను చేతకాని అభిమానంతో ఆత్మహత్య చేసుకుని చచ్చాడు. ఇందుకు ఏం చేస్తారు! న్యాయం అంటూ నిలబడితే తన స్థానం ఎలా వుండేదో తెలుసు. కనుకనే 'న్యాయం' అనే మాటని ఏట్లో కలిపేశాడు. అప్పటినించే

బాగా కల్సివస్తోంది. చూసే వాళ్ళు ఈర్ష్య పడేలా పెరిగాడు. తనకి అన్నీ వున్నాయి. డబ్బుంది. ఇల్లుంది. ముగ్గురు పిల్లలున్నారు. ప్రాణంలో ప్రాణంగా ప్రేమించే భార్య ఉంది. ఈమే అస్తమానం అంతస్థని గుర్తుచేస్తూ నీడలా వుంటుంది. అదేమిటో తెలియదు. అది 'శాంతి' అనీ అది తనలాంటి వాళ్ళ దరిదాపుల్లో వుండదనీ తెల్సుకున్న తర్వాత అశాంతిని తరిమికొట్టే చిట్కాల కోసం వెతుక్కున్నాడు. కోకొల్లలుగా దొరికాయి. ఇక 'శాంతి' కోసం అన్వేషణ మానేశాడు.

రంగారావు కంపెనీ నుంచి కారులో యింటికి వచ్చాడు. కారు దిగుతూండగానే ఆఖరి అమ్మాయి శ్రీలక్ష్మి పరుగున వచ్చింది.

"డాడీ! నానమ్మ వచ్చింది" అంది.

"ఎవరూ? " రంగారావుకీ మధ్య 'నానమ్మ' అనేమాట వినపడక చాలా సంవత్సరాలైంది. మర్చిపోయినట్లు మళ్ళీ అడిగాడు "ఎవరమ్మా వచ్చింది?" అని.

"మీ అమ్మ. నాకు నానమ్మ!"

"మా అమ్మా.... ఇక్కడికి నా యింటికి వచ్చిందా! ఎప్పుడు? ఎలా? స్టేషనుకి యెవరెళ్ళారూ..." అతని మనస్సులో అట్టడుగు పొరల్లో మూలనున్న మాతృప్రేమ ఒక్కసారి బుస్సున తన్నుకు పైకి వచ్చింది. అంతలో నాంచారమ్మ అక్కడికి వచ్చింది. రంగారావు భార్య ముఖంలోకి చూశాడు.

"ఏదీ! అమ్మ ఎక్కడుంది?" ఆత్రుతగా ప్రశ్నించాడు.

"వచ్చిన ఆవిడ ఎక్కడికీ వెళ్ళదు గానీ ముందు బట్టలు మార్చుకోండి"

"మార్చుకుంటానులే ముందు అమ్మ" రంగారావు వరండా దాటి హాల్లోకి పోబోతుంటే నాంచారమ్మ కళ్ళెర్రజేసినట్లు చూసింది. రంగారావు ఆగిపోయాడు.

"మీకోసం అర్జెంట్ ఫోన్ కాల్సు వచ్చాయి. ముందు పైకి పదండి."

రంగారావు మంత్రముగ్ధుడిలా మేడమీది గదిలోకి నడిచాడు. అతన్ని అనుసరించింది నాంచారమ్మ. రంగారావు మెట్లెక్కి పైకి పోతూంటే హాల్లో వున్న కర్టెన్ గుప్పెట్లో"పట్టుకుని పదిహేనేళ్ళ కుర్రాడు తన పెద్ద పెద్ద కళ్ళతో చూస్తూ తనలో తను అనుకున్నాడు. "చిన్నాన్న యెంత బావున్నాడో".

మేడమీదకి వెళ్ళిన రంగారావు రాత్రి తొమ్మిందింటికి గాని క్రిందకి రావటానికి వీలు కాలేదు. వచ్చి కూడా డైనింగ్ టేబిలుముందు భోజనానికి కూర్చున్నాడు.

"అమ్మ ఏదీ? భోజనం చేసిందా?" పక్కన కూర్చుని భోజనం చేస్తూ భర్తకి కొసరి కొసరి వడ్డిస్తూన్న భార్యని అడిగాడు.

"భోజనం చేయదట!"

"పోనీ..... ఫలహారం..."

"ఇప్పుడు చెప్తే ఎలా?" చికాకుగా చూసింది.

"వంటామె వుందిగా"

"ఆవిడ ట్యూటీ ఫలహారాలు చేయటం కాదు."

రంగారావుకి యీ ధోరణి, చికాకు కల్గించినా విసుగు కన్పించనీయకుండా "అమ్మని చూసి చాలా సంవత్సరాలైంది. ఆవిడ రాకరాక వచ్చింది. మాట్లాడద్దూ...."

"ఖర్మ... మీ పొజిషన్ ఏమిటో మీకే తెలియదు. అస్తమానం పక్కనుండి గుర్తుచేస్తూ వుండాలి. వంటామెని పిలవమంటాను వుండండి! 'కమలం సాయంకాలం వచ్చిన ఆవిడని ఓసారి అయ్యగారు పిలుస్తున్నారని పిలు."

కమలం వెళ్ళి పిల్చుకు వచ్చింది. రాజ్యలక్ష్మమ్మ వస్తోంది. రంగారావుకి తనచిన్నతనం గుర్తుకి వచ్చింది. అమ్మ... అమ్మ అటోంది మనస్సు. చదువుకునే రోజుల్లో ఎప్పుడన్నా ఆలస్యం అయితే చాలు "అబ్బాయి రాలేదురా స్కూలునుంచీ కాస్త వెళ్ళి పిల్చుకురా" అని అన్నయ్యతో అనేది. "ఏ ఆటల్లో పడ్డాడోలే వాడే వస్తాడు." అని నాన్న అన్నా ఆవిడ విన్పించుకునేది కాదు. పెద్ద కొడుకు సుందరాన్ని పోరి పంపేది. అన్నయ్య వచ్చి తీసుకువెళ్ళేవాడు. అమ్మకీ నాన్నకీ అన్నయ్యకీ తనంటే ఎంతో ప్రేమ!

"చీకటి పడకుండా యిల్లు చేరమని యెన్నిసార్లు చెప్పానురా రంగా'అని తల్లి మెత్తగానే మందలించేది.

'అలాగే వస్తానమ్మా' అని మాట యిచ్చేవాడు. కానీ అప్పుడే మర్చిపోయి తల్లికి వ్యధ కల్గించేవాడు. ఇలా హైస్కూలు చదువు అయిపోయింది. ఇంక కాలేజీ చదువుకి బస్తీ వచ్చేశాడు. కొత్తలో ప్రతి సెలవులకీ స్వంత వూరికి వెళ్ళేవాడు. అప్పటికి అన్నయ్య చదువు అయి, పెళ్ళి కూడా అయి ఓ చిన్న ఉద్యోగం చూసుకుని వెళ్ళిపోయాడు. వదిన మంచిది. మరిదీ అంటూ అతి ప్రేమగా వుంటుంది. అన్నయ్యా ప్రాణం విడుస్తాడు. ఇలా రోజులు గడిచిపోతున్నాయి. బస్తీ జీవితానికి అలవాటుపడి స్వంత వూరికి వెళ్ళటం తగ్గించేశాడు. అయినా తల్లిదండ్రులు నెలనెలా డబ్బు పంపిస్తూ వుండేవాళ్ళు. అదెలా వస్తోందో తెలియదు. కానీ అమ్మ మాత్రం బాధగా అడిగేది.

"రంగా! ఎందుకురా శలవుల్లో రావటం లేదు. నువ్వురాకుంటే ఇల్లు చిన్నపోతుందిరా. నాకు తోచీ చావదు."

"చదువుకోవల్సింది చాలా వుందమ్మా అదీ కాక మీరు పంపే డబ్బు ఖర్చులకి చాలటం లేదు"

"కావచ్చు. కానీ యింతకు మించి పంపలేం నాయనా"

"అలాగంటే యెలాగమ్మా అయితే నాదారి నే చూసుకుంటానంతే" కోపంగా వచ్చేశాడు. ఆ తర్వాత స్నేహితుడి చెల్లెలు నాంచారితో పరిచయం అయింది. అది ప్రేమగా మారింది. ఈ ప్రేమ యెక్కువ అవుతూన్న కొద్దీ తల్లిదండ్రులంటే చికాకు ఎక్కువైంది. ఓ రోజు స్వంత వూరి అతను కన్పించి కుశల ప్రశ్నలు అడిగాడు.

"బాగా చదువుకుంటున్నావా! నీ చదువుకోసం వాళ్ళు ఇప్పటికి రెండెకరాల మాగాణీ పొలం అమ్మేశారు. యింక వున్నది అరెకరం. వాళ్ళెలా బ్రతుకుతారో! నువ్వు త్వరగా చదువు కానిచ్చి వుద్యోగం చూసుకో బాబూ చూసుకుని వాళ్ళ కష్టాలు గట్టెక్కించు"

'అలాగే చేస్తానండీ' అన్నాడే కానీ ఇవన్నీ విసుగ్గా అన్పించేవి. నాంచారిని పెళ్ళి చేసుకుంటే వాళ్ళ నాన్న మంచి వుద్యోగం చూపి ఇల్లరికం వుంచుకుంటానన్నాడు. అలా వెడితే ఈ దరిద్రం తీరిపోను. ఛ... యిలా చేయకూడదు. అనుకున్నాడే కానీ ఆ మాట మీద నిలవలేక పోయాడు. నాంచారిని పెళ్ళాడేశాడు. తల్లిదండ్రులని చూస్తే వీళ్ళు పిల్లని యివ్వరని భయంతో వాళ్ళకి తెలియకుండానే పెళ్ళి చేసుకున్నాడు. యీ వార్త వాళ్ళకి చేరింది.తండ్రి గుండెలు బాదుకున్నాడు. నెల తిరక్కుండా ప్రాణాలు వదిలాడు. తను వెళ్ళాడు కానీ వుండటానికి వీల్లేదు అని వచ్చేస్తుంటే తల్లి దు:ఖం మింగి అంది-

"రంగా... అయిపోయిందేదో అయిపోయింది. అందుకు నేనేం అనను. కోడలిని ఓ సారి తీసుకొచ్చి చూపించు. నాలుగు రోజులుండి వెళ్ళండి"

'అలాగే' అన్నాడు. కానీ నాంచారి యిష్టపడలేదు.

"వాళ్ళని చూడవల్సిన అవసరం నాకులేదు! నే పెళ్ళాడింది నిన్ను అంతే" అంది.

"యిది మొండిది. చెప్పి లాభం లేదని తల్లినే రమ్మని రాశాడు. ఆవిడ వచ్చింది. ఒకే ఒక్కరోజు వుంది. వెళ్ళిపోయింది.అంతే మరెప్పుడూ రాలేదు. పదేళ్ళ క్రితం తన అన్నగారు హఠాత్తుగా పోయాడని వుత్తరం రాయించింది. బిజినెస్ పనులవల్ల వెళ్ళటానికి వీలుకాలేదు.. అది జరిగిన రెండు నెలల తర్వాత తల్లి వుత్తరం రాసింది.

రంగా వదిన్ని పోషించలేం అని ఆమె తల్లిదండ్రులు యిక్కడ వదిలేసి వెళ్ళారురా. ఆ అమ్మాయినీ అయిదేళ్ళ పిల్లాడినీ పోషించే శక్తి నాకెక్కడిది. అలా అని వాళ్ళనిబైటకి యెలాగెంటను? భర్తలేని కష్టం నాకు తెల్సి వదిన్ని ఎలా వదిలేయను. భగవంతుడిచ్చిన ఆస్తిపాస్తులు పోయినా రెక్కల్లో కాస్త శక్తి వుంది. ఈ శక్తితోనే వదిన్నీ అన్నయ్య కొడుకు శివప్రసాద్‌నీ పోషిస్తా. నువ్వు ఒక్కసారి వచ్చి చూసివెళ్ళు, నాకు కొండంత ధైర్యం వస్తుంది.

తల్లి అలా రాసినా వెళ్ళటానికి వీలు కాలేదు. ఆ తర్వాత వుత్తరాలు రాలేదు. ఓసారి వెళ్ళి చూడాలని అనుకోవటంలోనే పది సంత్సరాలు యిట్టే గడిచి పోయినట్లున్నాయి.

"కాలం విలువైనది. దాన్ని విలువైన విషయాలకే ఖర్చు చేసుకోవాలి" అని భార్య చెప్తూ ఉంటుంది. ఈ మాటల్లో చాలా యదార్థం వుంది అని తెల్సే ఆవిడ మాట జవదాటడు. అందువల్లనే అదృష్టం కల్సివచ్చింది. పది సంవత్సరాలుగా తల్లిని చూడలేదు. అమ్మ అన్నమాట యివాళ కాస్త వ్యధ పెడుతోంది. అమ్మ వచ్చింది అనే వార్త విని ఆమెని చూడాలనీ చూసి తను సాధించిన వన్నీ చెప్పాలని అన్పిస్తోంది. రాజ్యలక్ష్మమ్మ వచ్చి అయిదు నిమిషాలు అలాగే చూస్తూ నిల్చుంది. ఆరోగ్యంగా భారీగా ఖరీదైన లుంగీ కట్టుకుని సిల్కు షర్టు వేసుకుని భోజనం చేసే కొడుకుని కరువుతీరా చూసుకుంది. మాట్లాడాలనే విషయమే మర్చిపోయింది.

"అమ్మా"

"రంగా"

ఈ పిలుపు యెంతో ఆత్మీయంగా విన్పించింది. తలెత్తి తల్లివైపు చూస్తూ "అమ్మ ఇంత చిక్కిపోయిందేం. నల్లబడి పోయింది కూడా . అరె ముసలామెలా అయిపోయిందేమిటీ"

తనలో తను అనుకున్నాడు రామ్మా కూర్చో! 'మన వూళ్ళో అందరూ బాగున్నారా.' 'బాగున్నారురా' అంటూ మరో రెండడుగుల కొడుకు దగ్గరగా వేసింది. కానీ అక్కడ ఖాళీగా కుర్చీలు లేవు. వున్న రెండింటిలోను కొడుకూ కోడలు కూర్చుని వున్నారు. దూరంగా వున్న కుర్చీని తనే తెచ్చుకుని కూర్చోవాలి అన్పించలేదు. నిలబడే మాట్లాడుతోంది. రంగారావు భార్య ముఖంలోకి చూశాడు. 'నౌకరుతో కుర్చీ తెప్పించు' అన్నట్లుగా. నాంచారమ్మ అంత అవసరం లేదు అన్నట్లుగా మీగడ పెరుగు కొసిరి కొసిరి వేస్తూ తను వేసుకుని తింటూ ఒక్కసారి కోర చూపుచూసింది. అంతే రంగారావు ఆ విషయం వదిలేశాడు.

కుశల ప్రశ్నల తర్వాత తల్లివెనక నిల్చున్న పదిహేనేళ్ళ కుర్రాడిని చూస్తూ అడిగాడు. "గుండులా వున్నాడు వాడెవరమ్మా!"

"వాడే నీ అన్న కొడుకు శివప్రసాద్, శివుడు మన వూళ్ళో హైస్కూల్లో పదో తరగతి మంచి మార్కులతో పాస్ అయాడు. నాకు చేతనైంది చెప్పించాను. అన్నయ్య లేడు గనుక వీడి బాధ్యత మనదే. నీ ముగ్గురు పిల్లలతోబాటు నాలుగో వాడనుకుని వీడి బాధ్యత నువ్వ వహించు. వీడి భవిష్యత్తు తీర్చిదిద్దు. వీడిని నీ దగ్గర వదిలి వెళ్ళాలనే వచ్చాను"

"అలాగా... ఉత్తరం రాసి వుండాల్సింది"

"రాశాను. జవాడు రాలేదు"

"నాకా... నీ ఉత్తరమా! అందలేదే" "ఒరే రంగా నేవచ్చాను. విషయం చెప్పు' క్షణం ఆలోచించి ఆ తర్వాత అన్నాడు "అలాగేనమ్మా. శివుడిని ఇక్కడ వదిలి వెళ్లు' ,

అసలు తన భర్త ని ఇందాకటినించీ ఈ ముసలామె ఒరే రంగా అంటూన్నందుకే నాంచారమ్మకి వళ్ళు మండుకొస్తోంది. ఇంక శివుడు నీ కొడు కనుకో అనేసరికి మరీ భగ్గు మంది. తన భావం భర్తకి అర్థమయ్యేలా సకిలించింది. రంగారావు పట్టించుకునే స్థితిలో లేదు.

చిన్నాన్న తనని ఈ మేడలో వుండనిస్తాడనీ చదివిస్తాడనీ తెల్సుకున్న శివుడి ముఖం చాటంత అయింది. ఇంతలో రంగారావు మూడో కూతురు శివుడి చెయ్యి పట్టుకుని

"మనిద్దరం ఎంచక్కా కల్సి చదువు కుంటాం కదన్నయ్యా. నాకు లెక్కలు చెప్తావా" అడిగింది.

"ఓ... చెప్తానమ్మా శ్రీలక్ష్మీ" అంటూన్న శివుడిని చెయ్యి పట్టుకుని తనగదిలోకి లాక్కుపోయింది "పుస్తకాలు చూపిస్తాను రా అన్నయ్యా" అంటూ

రెండు రోజులు అయ్యాయి. నేవెళ్ళి పోతాను నాయనా' అని చెప్పింది రాజ్యలక్ష్మమ్మ.

"మరో నాలుగురోజులు వుండమ్మా"

"వీలు కాదురా. వెళ్ళాలి"

"సరే..." అన్నాడు. రాజ్యలక్ష్మమ్మ ప్రయాణం అయింది. బస్ దగ్గరికి కారులో దించు తానులే... అని, మేడమీదికి గదిలోకి వెళ్ళాడు రంగారావు.

డైనింగ్ హాలులో నించీ నాంచారమ్మ కేకలు వినిపిస్తున్నాయి.

"యిక్కడ పెట్టిన పదిరూపాయిల కాయితం ఏమైంది! ఎవరు తీశారు. ఎవరుతీశారో చెప్పకుంటే చంపేస్తాను. ఈ యింట్లో యింతవరకూ యెప్పుడూ దొంగతనం జరగలేదు. యిప్పుడు కొత్తగా దొంగలెవరు వచ్చారు" నౌకర్లని బెదిరిస్తోంది. వాళ్ళు భయంగా చూస్తూ మాకేం తెలియదండీ"-వొణుకుతున్నారు.

"మరెవరు తీశారు. యిదెవరిపనో తెలియాలి నేనిలాంటివి సహించలేను."

ఇలా అరిచినా యెవ్వరూ "మేం దొంగలం" అని ముందుకు రాలేదు. రంగారావు సూటూ బూటూ వేసుకుని క్రిందికి వచ్చాడు. యిది విని తనూ అరిచాడు. అయినా ప్రయోజనం కన్పించలేదు. రంగారావు పెద్ద కొడుకు అది వెతికీ, యిదివెతికీ ఆఖరున శివుడి బట్టల సంచీలో పదిరూపాయిల కాయితం దొరికిందని తెచ్చి తండ్రి కిచ్చాడు. శివుడు ఎక్కడో మూల కూర్చుని శ్రీలక్ష్మికి కాశీమజిలీ కథ చెప్పటంలో మునిసిపోయి వున్నాడు.

"ఏడిరా వాడిని యీడ్చుకురండి" నౌకర్లకి ఆర్డర్ వేశాడు. వాళ్ళు శివుడికి యీ విషయం యేమిటో చెప్పకుండా లాక్కు వస్తుంటే విస్సురుగా గుంజుకున్నాడు. నౌకర్లు చిన్నాన్న లాక్కు రమ్మన్నారు. అన్నారు.

"నేవస్తాను. దగ్గరకొచ్చారా చావగొతాను జాగ్రత్త" అంటూ నలిగిన షర్టునీ చెదిరిన క్రాపునీ చేత్తో సర్దుకుంటూ డైనింగ్ హాల్లోకి వస్తుంటే నాంచారమ్మ కంపరంగా చూస్తూ అంది.

"నడక మాత్రం నవాబులా ఉంది. గానీ బుద్ధి ఏదీ! నాకు తెల్సు ఇలాంటి వాళ్ళకి పెద్ద బుద్ధులెలా వస్తాయి. ఛీ ఛీ..."'

శివుడికి అర్థం కాలేదు. కానీ ఆవిడ చీదరించుకోవటం అర్థమై పౌరుషం ముంచుకు వచ్చింది. అయినా మింగుకుని పినతండ్రి వైపు చూస్తూ "పిలిచారా చిన్నాన్నా" మర్యాదగా అడిగాడు.

"పిలిచానురా ఎందుకో తెల్సునా? యిందుకు" యీడ్చి కొట్టాడు రంగారావు.

"చిన్నాన్నా" కందిపోయిన చెంపని చేత్తో పట్టుకుని అర్థం కాని వాడిలా చూశాడు.

"దొంగవెధవా ఏం తెలియని వాడిలా అలా చూస్తావేం" మళ్ళీ చెయ్యెత్తాడు రంగారావు.

'రంగా' ఆగు. మూల గదిలో వున్న రాజ్యలక్ష్మికి యిప్పటికి తెల్సిందీ విషయం అంతే - పరుగున వచ్చేసి కొడుకు చెయ్యి పట్టుకుంది. తల్లి అలా వచ్చి 'ఆగు' అని గర్జించగానే భర్త పిల్లిలా ఆగిపోవటం నాంచారమ్మకి నచ్చలేదు. వళ్ళంతా కారం రాచుకన్నట్లుగా మంటలెత్తింది.

"చిన్నాన్నా నేను దొంగని కాను. నాకేం తెలియదు. దొంగలా డబ్బు తీసే అలవాటు నాకు లేదు. ఆ అవసరం కూడా లేదు. మరోసారి దొంగ అన్నావా జాగ్రత్త. మర్యాద దక్కదు"

శివుడిముఖం ఎర్రబడి పోయింది. ఆవేశంతో వూగిపోతూ పినతండ్రికే యెదురు తిరిగాడు.

పదిహేనేళ్ళ దిక్కులేని శివుడు, తనింట్లో ఆశ్రయం కోసం వచ్చి తననే యెదిరించి మాట్లాడమా! అందులోనూ తనంటే పెద్దపులిలా భయపడే నౌకర్ల ముందు యిలా మాట్లాడటానికి వాడికి ఎంత ధైర్యం? అసలెలా వచ్చిందీ యెక్కడినించీ వచ్చిందా ధైర్యం? రంగారావుకి పిచ్చికోపం వచ్చింది.

"పైసా అంటే యేమిటో యెరుగని ముష్టివెధవలని చుట్టాలంటూ యింట్లోకి రానిస్తే దొంగతనం చేయక ఏం చేస్తారు" వ్యంగ్యంగా అంది నాంచారమ్మ. రంగారావు రక్తం పొంగింది శివుడి జుట్టు పట్టుకున్నాడు. రాజ్యలక్ష్మమ్మ యింక చూడలేక పోయింది.

"రంగా ఆగు... ముందు వాడిని వదులు" గర్జించింది. రంగారావు చేతులూ కాళ్ళూ వణికాయి. శివుడు పినతండ్రిని ఒక్కతోపు తోసి దగ్గరగా వచ్చేశాడు.

"శివా! ఆ డబ్బు నువ్వు తీశావా!" అతి కష్టం మీద రాజ్యలక్ష్మమ్మ నొచ్చుకుంటూ అడిగింది.

"నాన్నమ్మా..." శివుడి కళ్ళలో నీళ్ళుతిరిగాయి.

"నువ్వు తీశావు అనటం లేదు. తీశావా! అని అడుగుతూన్నాను"

"నానమ్మా దేవుడి తోడు. నేనేం యెరగను. శ్రీలక్ష్మికి కథలు చెప్తూన్నాను"

రాజ్యలక్ష్మమ్మ కొడుకు వైపుకి తిరిగింది. రంగారావు అసహనంగా అరిచాడు.

"అమ్మా వాడిని నమ్మకు. వాడు తియ్యకుంటే వాడి సంచీలోకి యెలా వచ్చింది?"

"రంగా శివుడు పేదవాడు కావొచ్చు. కానీ దొంగబుద్ధి మాత్రం లేదు. చూడూ నిన్ను పెంచిన యీ చేతుల్తోనే వీడినీ పెంచి పెద్ద చేశాను. నువ్వు దొంగవా! చెప్పు!"

రంగారావు, 'అమ్మా' అంటూ నీళ్ళు నమిలాడు. నాంచారమ్మకి భర్త చేత కాని తనాన్ని చూస్తే అసహ్యం వేస్తోంది. ఆ ముసలి ఆగమంటే ఆగిపోవడమే. ఛీ ఛీ.. ఛీత్కరించుకుంది.

"రంగా! మనిషి సంపాదించు కోవల్సింది సంపద. నిజమే.కాని దానికి మించి సంపాదించు కోవల్సింది మానవత్వం, మర్యాద, తోటి మనిషిని మనిషిగా గుర్తించటం. నీవు సంపాదించిన దాని కంటే పోగొట్టుకున్నదే విలువైనది" అంది.

"ఏమిటండీ ఆవిడ అలా వాగుతుంటే చూస్తూ వూరుకుంటారేం" నాంచారమ్మ తోక తొక్కిన తాచులా లేచింది. రంగారావుకి కాళ్ళూ చేతులూ ఆడటం లేదు. యింతలో మూడో కూతురు 'డాడీ' అని పిల్చింది. తలెత్తి కూతురు వైపు భయంగా చూసాడు.

"డాడీ' యిలా చెయ్యమని ప్లాన్ వేసింది అమ్మా మీరేగా. డాడీ! మీరూ అబద్ధం ఆడి శివుడిని దొంగ అంటూన్నారా! మీ ప్లాను విన్నాను కానీ అది శివుడి మీదకే అని తెలియదు. లేకుంటే నాన్నమ్మకి అప్పుడే చెప్పేదాన్ని"

రాజ్యలక్ష్మమ్మ మనవరాలి నిర్భయానికి విస్తుపోయింది. ఆ తర్వాత యిది ప్లాన్‌గా చేశారని తెల్సి అసహ్యంగా అందరి ముఖాల్లోకి చూసింది. కొడుకునీ చూసింది.

"రంగా నువ్వింత 'నాపవెధవ్వి' అనుకోలేదురా. ఛీ ఛీ! నువ్వు నా కొడుకువని చెప్పుకోవటం నాకే సిగ్గుచేటు. శివా! సంచీ పట్టుకురా పోదాం."

శివుడు సంచీతో నానమ్మ వెంట ఆ మూడంతస్తుల మేడలోంచి బైటికి వచ్చేశాడు. వెనక శ్రీలక్ష్మి యేడుపు పెద్దగా విన్పిస్తూ వుంది శివుడు బాధగా చూస్తూ ఆగాడు.

"నాయనా! గంజాయివనంలో తులసి మొక్క అది. దాన్ని భగవంతుడే రక్షిస్తాడు. పద వెళ్ళి పోదాం"

శివుడు నాన్నమ్మ వెంట బస్‌స్టాండ్ వైపు నడుస్తూ హఠాత్తుగా ఆగి అడిగాడు.

"నానమ్మా నాపవెధవ అంటే ఏమిటీ?"

(విపుల)